నిరుద్యోగ భృతి ఇవ్వాలి



నేను బీటెక్ చదువుకున్నాను. ఉద్యోగం రాలేదు. కుటుంబ పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఎన్నికల హామీలో చదువుకున్న యువతీ యువకులందరూ ఉద్యోగాల్లో చేరేంత వరకు వారికి నిరుద్యోగ భృతి కల్పిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి నందున నిరుద్యోగభృతి అందించి ఆదుకోవాలి.

–ఆకుల నాగరాజు, అడవిరావులపాడు నందిగామ మండలం

ఆడబిడ్డ నిధి కింద మహిళలకు రూ.1500 ఇవ్వాలి



టీడీపీ నాయకులు ఎన్నికల టైంలో 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ పథకాన్ని సూపర్‌సిక్స్‌లో చేర్చి ఇంటింటా ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100రోజులు అవుతోంది. ఈ పథకాన్ని అమలుచేస్తే మహిళలకు ఆర్థికంగా ఉపయోగంగా ఉంటుంది. వెంటనే అమలుచేసి మహిళలను ఆదుకోవాలి.

–కృష్ణవేణి, కె.పొన్నవరం, పెనుగంచిప్రోలు మండలం

తల్లికి వందనం కోసం ఎదురుచూస్తున్నాం



నాకు ఇద్దరు కుమార్తెలు. చిన్నమ్మాయి జమ్మవరం జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. జగన్‌మోహన్‌రెడ్డి ఏటా పాఠశాలల ప్రారంభంనాటికి అమ్మఒడి నగదు తల్లుల ఖాతాల్లో జమయ్యేది. కూటమి ప్రభుత్వం ఈ పథకం పేరును తల్లికి వందనంగా మార్చి ప్రతిఒక్క విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామన్నారు. పాఠశాలలు ప్రారంభమై మూడునెలలు పూర్తయినా నేటికీ నగదు జమ కాలేదు. ప్రభుత్వం స్పందించి జమ చేయాలి.

– యాదాల సుజాత, జమ్మవరం, వీరులపాడు మండలం

పెట్టుబడి సాయం అందిస్తే రైతులకు ఎంతో మేలు



ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద అన్నదాత పథకం పేరుతో ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్నారు. గత ప్రభుత్వంలో రైతుభరోసా కింద ఏడాదికి రూ.13,500 చొప్పున నాలుగేళ్లపాటు రూ.54వేలు వచ్చాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు చంద్రబాబు ఈ పథకాన్ని అమలుచేయాలి. ఈ ప్రభుత్వం ఇస్తుందని ఎదురుచూస్తున్నాం.

–రేగండ్ల రత్నకుమారి, రైతు, పెనుగంచిప్రోలు

మహిళలకు నెలకు రూ.1500 ఇవ్వాలి



తాము అధికారంలోకి రాగానే 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు 1500 ఇస్తామని కుర్చీ ఎక్కిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. మహిళలు ఆయా వాగ్దానాలను నమ్మి ఓట్లు వేసి గెలిపించారు. ప్రభుత్వం ఇప్పుడు ఆ సంగతే పట్టించుకోకపోవడం సమంజసం కాదు. ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. గత ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యమిచ్చిందని గుర్తించాలి.


–దాచేపల్లి ఉమ, జగ్గయ్యపేట

నిరుద్యోగ భృతి జాడేలేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి కల్పిస్తామని, ఉద్యోగాలు వచ్చేలా చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అయితే ఇంతవరకు నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో భాగంగా నిరుద్యోగ భృతిని వెంటనే అందించాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటుతున్నందున నిరుద్యోగ భృతిపై స్పష్టమైన ప్రకటన చేయాలి.

–షేక్ షాయిన్, నిరుద్యోగి, పెండ్యాల



అదే మాట.. అదే మోసం

- నారా వారి మాట.. నీటి మూట
- 'సూపర్ సిక్స్' అమలు కోసం ప్రజల ఎదురుచూపులు
- హామీల అమలు అంటే భయమేస్తుందన్న సీఎం చంద్రబాబు

జగ్గయ్యపేట/పెనుగంచిప్రోలు/జగ్గయ్యపేటఅర్బన్/వత్సవాయి/కంచికచర్ల/నందిగామటౌన్/వీరులపాడు: అంతిస్తాం.. ఇంతిస్తామంటూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కూటమిలో ప్రధాన నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు అలవికాని హామీలు ఇచ్చారు. జనసేన అధ్యక్షుడు, ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, నారా లోకేష్ ఎన్నికల ప్రచారంలో ఈ పథకాలపై ఊదరగొట్టారు. హామీల అమలుకు సంపద సృష్టిస్తానంటూ అధికార దాహంతో అంతులేని హామీలు ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి ఏర్పడి 100రోజులు అవుతున్నా హామీల అమలులో కదలిక లేదు. పైగా సీఎం చంద్రబాబు అసెంబ్లీలో హామీలు అమలుచేయాలంటే భయమేస్తోందంటూ ప్రకటన చేయడంతో 'బాబు నాడు మాటలు చెప్పారు.. నేడు మోసం చేస్తున్నారు' అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హామీల అమలులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే బాగుందని అప్పుడే ప్రజలు చర్చించుకుంటున్నారు. తల్లికి వందనం పేరుతో ప్రతిబిడ్డకు ఏడాదికి రూ.15వేలను వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తామని మంత్రి లోకేష్ ప్రకటించడం అన్యాయంటున్నారు. రైతులకు ఏడాదికి రూ.20వేలు ఇస్తామని ప్రకటించి, ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. మహిళలకు ప్రతినెలా రూ.1500, యువతకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాల భర్తీ, ఏడాదిలో ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సూపర్ సిక్స్ హామీలన్నీ ప్రకటనలకే పరిమితమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



ప్రతి మహిళకు నెలకు రూ.1,500

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

జగ్గయ్యపేట	1,05,166
చేకూరాల్సిన లబ్ధి	రూ. 15.77 కోట్లు
నందిగామ	68,631
చేకూరాల్సిన లబ్ధి	రూ.10.29 కోట్లు



జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
రైతుభరోసా	జగ్గయ్యపేట:	రూ.41.10
	నందిగామ:	రూ.29.70



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

జగ్గయ్యపేట:	30,446 మంది
చేకూరాల్సిన లబ్ధి	రూ.60.89 కోట్లు
నందిగామ:	24, 879
చేకూరాల్సిన లబ్ధి	రూ.49.75 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
అమ్మ ఒడి	జగ్గయ్యపేట:	రూ. 40.95
	నందిగామ :	88.40



టీడీపీ పాలనలో ఏటా తల్లికి అందాల్సిన సాయం

	లబ్ధిదారులు	లబ్ధి
జగ్గయ్యపేట:	29,730	రూ. 43.95 కోట్లు
నందిగామ:	71,000	రూ.100.65 కోట్లు



యువతకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

జగ్గయ్యపేట :	20 వేల మంది
అందాల్సిన లబ్ధి	రూ.6 కోట్లు
నందిగామ :	23వేలమంది
అందాల్సిన లబ్ధి:	రూ.6.90 కోట్లు

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పేరుతో చంద్రబాబు, కూటమి నేతలు హామీలు గుప్పించారు. నిరుద్యోగ భృతి కింద యువతకు నెలకి రూ.3వేలు ఇస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి వందరోజులు అవుతున్నా ఇప్పటికీ నిరుద్యోగ భృతి అమలు గురించి రాష్ట్రప్రభుత్వం పట్టించుకోలేదు. ఇకనైనా నిరుద్యోగ భృతి కింద యువతీయువకులను ఆదుకునేందుకు నెలకి రూ.3వేలు ఇచ్చి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

–మద్దుకూరు శిరీష, నందిగామ

తక్షణం ఫీజు కట్టాలంటున్నారు



మాకు ఇద్దరు పిల్లలు. వత్సవాయిలోని ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్ దీనిపై ప్రచారం చేశారు. తల్లికి వందనం కింద ఇద్దరు పిల్లలకు డబ్బులు వస్తాయని అనుకుంటున్నాం. పాఠశాలలో ఫీజులు కట్టాలని చెబుతున్నారు. ఫీజులతోపాటు విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, బ్యాగ్ మొదలైన వాటికి చాలా ఖర్చు చేశాం.

–ఎ నాగమణి, వత్సవాయి

'భృతి' ఎప్పుడిస్తారు.. సారూ..



సూపర్‌సిక్స్‌లో భాగంగా తాము అధికారంలోకి రాగానే రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాలను ఇస్తామని, నిరుద్యోగులకు ప్రతినెలా రూ.3 వేలు భృతి అందిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి రాగానే ఆశపడ్డాం. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులవుతోంది. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వెంటనే నిరుద్యోగ భృతి అందించి యువతను ఆదుకోవాలి.

–పి.పవన్‌కుమార్, దుర్గాపురం, జగ్గయ్యపేట

నష్టపరిహారంతోపాటు పెట్టుబడి సాయం ఇవ్వాలి



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. అన్నదాత పథకం కింద రూ.20వేలు ఇస్తామన్నారు. కాని ఇప్పటికీ రూ.20వేలు ఇవ్వలేదు. చంద్రబాబు మాటలు నీటిమీద రాతలుగా మారాయి. ఇటీవల సంభవించిన వరదలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారంతోపాటు పెట్టుబడిసాయం అందించి రైతులను ఆదుకోవాలి.

–దేవరకొండ గురవయ్య,రైతు, కంచికచర్ల

ఖర్చులు పెరిగాయి



మాకు ఇద్దరు పిల్లలు. గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. తల్లికి వందనం కింద ఇద్దరికి డబ్బులు వస్తాయని ఎదురుచూస్తున్నాం. ఎన్నికల ప్రచారంలో ఈ పథకంపై కూటమి నేతలు పదేపదే చెప్పి ఓట్లు అడిగారు. దీనిపై పాలకులు వెంటనే స్పందించి మార్గదర్శకాలు ఇవ్వాలి. పాఠశాలలు ప్రారంభించి వంద రోజులు అవుతోంది. పిల్లల ఇతర ఖర్చులకు సంబంధించి ప్రభుత్వం చెప్పిన విధంగా డబ్బు విడుదల చేస్తే మేలు చేసినవారవుతారు.

– ఎం.రోజా, మక్కపేట, వత్సవాయి

సాయం అందించి ఆదుకోవాలి



ఖరీఫ్ ప్రారంభ సమయంలో పెట్టుబడిసాయంగా రైతుభరోసా పథకం కింద గతేడాది వరకు ఏటా రూ.13500 అందించారు. అన్నదాత పథకం కింద రైతులకు ఏటా రూ.20వేలు ఇసామంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేరలేదు. ఈఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరిపంట వరదలకు దెబ్బతిని తీవ్రనష్టాల్లో ఉన్నాం. సాయం అందించి ఆదుకోవాలి.

–జీతం వెంకయ్య, వెల్లుర్తిపాడు, పెనుగంచిప్రోలు

నేటినుంచి ఇసుక విక్రయాలు

జగ్గయ్యపేట: మండలంలోని అనుమంచిపల్లి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద గురువారం నుంచి ఆన్‌లైన్ ద్వారా ఇసుక విక్రయాలు చేపడుతున్నట్లు విజయవాడ మైనింగ్ ఏడీ వీరాస్వామి గురువారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇసుక విక్రయాలు ప్రారంభిస్తున్నామన్నారు. ఇసుక కావలసినవారు గ్రామ, వార్డు సచివాలయాలలో ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవాలని సూచించారు.

వరద బాధితులకు సాయం

నవాబుపేట(పెనుగంచిప్రోలు): వరద బాధితులకు సహాయార్థం స్థానిక విశ్వవాణి ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తుల సహకారంతో రూ.65వేలు సేకరించారు. ఈనగదును ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ద్వారా డీడీ రూపంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. విశ్వవాణి విద్యాలయం నిర్వాహకులు గింజుపల్లి రవికుమార్, టీచర్లు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

చౌటపల్లి(వీరులపాడు): మండలంలోని చౌటపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం ధ్వంసం చేశారు. విషయాన్ని గుర్తించిన గ్రామ ఉపసర్పంచి కోట సంగయ్య ఫ్లెక్సీలను చించివేసినవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా సంగయ్య మాట్లాడుతూ ఫ్లెక్సీలను ధ్వంసం చేయడం తగదన్నారు. ప్రశాంతంగా ఉండే గ్రామంలో అల్లర్లు సృష్టించేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నవారిపై కఠినచర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఆయన వెంట కోట రామారావు, మట్టూరి సాయిబాబు తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



గరికపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు, శాస్త్రవేత్తలు

జగ్గయ్యపేట అర్బన్: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రతిఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత హి సేవ–2024 ర్యాలీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ఆర్.రాఘవేంద్ర, కౌన్సిలర్లు సంగెపు బుజ్జిబాబు, గొట్టె నాగరాజు, ఇర్రి నరసింహారావు, జి.వెంకట్రావు, కమిషనర్ ఎం.రామ్మోహనరావు, మెప్మా సీవోలు నిర్మల, శ్రీదుర్గ, వెంకట్, సీఎంఎం శ్రీధర్, ఆర్పీలు, డ్వాక్రాసభ్యులు పాల్గొన్నారు.

గరికపాడు కేవీకేలో..

గరికపాడు(జగ్గయ్యపేట): గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ చేశారు. స్వచ్ఛత హి సేవ ప్రతిజ్ఞ చేశారు. కేవీకే కోఆర్డినేటర్ కృష్ణంరాజు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. శాస్త్రవేత్తలు, పాలిటెక్నిక్ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.







● నిమజ్జనానికి తరలిన గణనాథులు



జగ్గయ్యపేట అలంకార్ సెంటర్ వినాయకుడిని బుధవారం పాలేరులో నిమజ్జనం చేశారు. తొర్రగుంటపాలెంలో కుంకుమార్చనలు చేశారు. కంచికచర్లలోని మోడల్‌కాలనీ, ఇందిరాకాలనీ, పెనుగంచిప్రోలులోని వినాయకుడి విగ్రహాలను పూజల అనంతరం మునేరులో నిమజ్జనం చేశారు.–కంచికచర్ల, జగ్గయ్యపేట అర్బన్,పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట

రూ.మూడు లక్షల విరాళం

నందిగామ టౌన్: కాకతీయ అపోలో విద్యా సంస్థల ఆధ్వర్యంలో వరద బాధితులకు సహకారం అందించడం సంతోషంగా ఉందని విద్యా సంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాద్ అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం సహకారంతో వరద బాధితుల సహాయార్థం రూ. మూడు లక్షల చెక్కును బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. పాఠశాల డైరెక్టర్ కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



కీసర(కంచికచర్ల) :మండలంలోని కీసర బీజేటీ డిగ్రీ కళాశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం పేర్కొన్నారు. కార్యక్రమ ముఖ్యఅతిథి తమిళనాడుకు చెందిన లసాల్ స్కూళ్ల ప్రతినిధి బ్రదర్ అమలన్ మాట్లాడుతూ డిగ్రీ అనేది ఉత్తమమైన జీవితానికి ఓ మలుపు అని పేర్కొన్నారు. అకడమిక్ ప్రతిభ వ్యక్తిగత వృద్ధి, సామర్థ్యం, నిబద్ధతను పెంచుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో టెక్నికల్ స్కిల్స్ బాగా అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల సెక్రటరీ బ్రదర్ యువారి ఆంథోని, డీన్ దుగ్గిరాల ప్రకాష్, బ్రికెస్టేన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక రంగస్వామి బజారులోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతం చేశారు. అంగన్‌వాడీలు లక్ష్మీకాంతమ్మ, అనంతలక్ష్మి, ఏఎన్ఎం విజయశాంతి, ఆశావర్కర్ దుర్గ పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందజేత

మక్కపేట(వత్సవాయి) :గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అజ్మీరు శ్రీనివాసరావు తన తల్లిదండ్రులు అజ్మీరు వీరభద్రయ్య, తులశమ్మ జ్ఞాపకార్థం పాఠశాలకు క్రీడాసామాగ్రిని బుధవారం అందజేశారు. క్రీడాసామగ్రిని అందజేసిన శ్రీనివాసరావును పాఠశాల హెచ్ఎం చిత్రాల వెంకటేశ్వరరావు, టీచర్లు దారావతు శ్రీనివాసరావు, షేక్ జానీ, పిచ్చేశ్వరమ్మ, రేవతి, స్వప్న అభినందించారు.

చిరుధాన్యాలపై అవగాహన



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): సంపూర్ణ పోషక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. రాగులు, పెసలు, సజ్జలు, జొన్నలు, సామలు వంటి చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.